# వర్షించని మేఘాలు

"అబ్బాయిని చూడటాని కిన్నాళ్ళనుంచి తీరనేలేదు కాబోలు" అన్నది సుగుణ కళ్ళచివరల్లోంచి రామచంద్రం వైపు చూస్తూ.

"ఊఁ" అన్నాడు అతను ముభావంగా, చేతుల్లోని పేపరు పేజీ త్రిప్పుతూ.

"నిజంగానే తీరలేదా?"

"లేదన్నానుగా" పొడిగా విసుగ్గా అన్నాడు చంద్రం.

"తీరటం తీరకపోవటం మీ చేతుల్లోపనేగా. అంత తీరకపోవటానికి మీరు చేసే రాచకార్యాలేమున్నాయి."

"ఇల్లు కట్టిస్తున్నాను."

"ఇల్లా?"

"అవును."

"ఎందుకు? ఇప్పుడున్న ఇల్లేం చేస్తారు?"

"అదీ ఉంటుంది"

సుగుణ అర్థంకాని చూపులతో అతనివైపు చూసింది.

"రెండిళ్ళెందుకు?"

చంద్రం మాట్లాడలేదు.

"అద్దెకిస్తారా?"

"ఏదో చేస్తాలెద్దూ నీ కెందుకా గొడవ" విసుక్కున్నాడు చంద్రం.

సుగుణమనసు కొంచెం చివుక్కుమంది. భర్తగొడవలు భార్యకి కాకపోతే మరెవరికి కావాలి. అయితే, చంద్రం ఇలా విసుక్కోవటం ఇది మొదటిసారి కాదు; ఎన్నోసార్లు చెప్పటం తేలికకాదు. కారణంకూడా సుగుణకి తెలుసు. ఇంతవరకు వికాసంతో ఉన్న ఆమె మొఖం వాడిపోయింది.

"మనోరమకా."

చంద్రం ముఖం చిట్లించుకున్నాడు.

"అంతేనా?"

కోపంలో పేజీ త్రిప్పబోయి దాన్ని చింపాడుచంద్రం.

"ఎవరికయితే నా కెందుకులెండి" అన్నది సుగుణ విషాదంగా.

"అలా అని ఊరుకోరాదూ, ఊరకే నన్ను చంపక పోతే!" పేపరు మడిచి బల్లమీద పారేస్తూ కసురుకున్నాడు చంద్రం. సుగుణకళ్ళు చెమ్మగిల్లాయి. భర్తముందు ఆమెకళ్లు చెమ్మగిల్లటం, ఆమె కాపరానికి వెళ్ళి రెండేళ్ళలో ఇది ఎన్నో

సాలో! అతని హృదయంలో ఆమె కన్నీళ్ళకి విలువ లేదు. లేదని ఆమెకికూడా తెలుసు. తెలిసినందువల్లే ఆమెకళ్లు మరింతగా చెమ్మగిల్లటం, తరవాత వాటంతట అవి ఆరిపోవటం, ప్రక్కకి తిరిగి, కన్నీళ్ళని తుడుచుకుంటూ అందామె విషయం మారుస్తూ.

"అబ్బాయిని చూశారా?"

"ఊఁ"

"ఎవరిపోలిక?"

"ఏమో"

"అంతా మీ పోలికే అంటున్నారు."

"ఊఁహూఁ"

"ఆ కళ్ళూ ముక్కూ అంతా మీ పోలికే"

పాపాయివేపు చూశాడు చంద్రం. ఆ చూపుని చూసి సుగుణ మురిసిపోయింది. సంతోషంలో పొరపాటున ఒక చెణుకు విసిరింది, తన స్వభావాని కనుగుణంగా.

"రూపులో మీ పోలికొచ్చినా, బుద్ధిలోనైనా రాకుండా ఉంటే బావుండును."

"నీకు నేనంటే అంత అసహ్యమన్నమాట" కోపంతో చంద్రం ముఖం ఎర్రబడ్డది.

సుగుణకి గుండె గతుక్కుమంది. క్షమాపణ కోరుకున్నట్టుగా అన్నది వణికే కంఠంతో.

"తమాషాగా అన్నానండీ!"

"తెషామా! నేను మొదట్నుంచీ చూస్తూనేవున్నాను, వెధవ యెత్తిపొడుపులు. నా యిష్టంవచ్చినట్లు నేను తిరుగుతాను, నువ్వెవ్వరని అడగటానికి?"

"ఇంకెప్పుడూ అనను, పొరపాటున నోరు జారి..."

"నోరు జారిందేం? అయితే అనుభవించు. కాలు జారినా తీసుకోవచ్చుగాని నోరుజారితే ఇహ అంతే—" చివాలున లేచాడు కూర్చున్న కుర్చీలోంచి చంద్రం. ఈ ఆకస్మిక పరిణామానికి స్తంభీభూతురాలయింది సుగుణ.

"మీకంత కోపం వస్తుందనుకోలేదు, లేకపోతే అనేదాన్ని కాదు."

ఆమె మాటలు వినిపించుకోకుండా విసురుగా వెడుతున్న అతని దారికి అడ్డంగావచ్చి అతని కండువా పట్టుకుని బ్రతిమాలే స్వరంతో అంది సుగుణ.

"మీరిలా వెళ్ళిపోతే అంతా ఏమనుకుంటారు? ఇవాళ బారసాలగదా! నలుగురిలో ఎంత తలవంపులుగా ఉంటుంది! ఇంకెప్పుడూ అనను. ఈసారికి మర్చిపొండి."

కోపం, అహంకారం, పగ్గాలేసి లాగటంవల్ల, చంద్రం అడ్డువచ్చిన సుగుణని తోసుకుని ముందుకు వెళ్ళిపోయాడు, నోటిని ఇష్టంవచ్చినట్లు పారేసుకొంటూ.

అతను వెళ్ళిపోయిన దారివైపు శూన్యంగా చూసిం సుగుణ. పెళ్ళికాకముందు ఇటువంటి దృశ్యం ఆమెకి కలలో కూడా కనపడలేదు. క్లాసు పుస్తకాలకంటే ఎక్కువగా నేటి తెలుగు పత్రికలని క్షుణ్ణంగా చదివిన సుగుణకి, మబ్బులలో

మబ్బులుగా కలిసిపోతున్నట్లు ఆకాశంలో సంచరించే ప్రేయసీ-ప్రియులు చిత్రాలుకాక నేలమీద నడిచే కొందరు భార్యా భర్తల యదార్థ జీవిత దృశ్యాల్లో ఒకటికూడా ఎప్పుడూ కనిపించకపోవటంలో ఆశ్చర్యం లేదు. ఒకానొక ప్రేమైక హృదయాన్ని నిండు ప్రేమతో పరిపాలించాలనే ఆమె వాంఛ నిర్దయగా ఇలా తోసివేయబడుతుందని, కనీసం అలా తోసి వేయబడటానికి అవకాశం లేకపోలేదని, ఆమె యెప్పుడూ ఊహించుకోలేదు. చనువుగా, ప్రేమగా ఒక్కమాట మాట్లా డటానికికూడా ఆమె భర్తదగ్గిర ఆమెకి అధికారంలేదు.

"ఎందుకీ జీవితం" నిట్టూర్చింది సుగుణ.

"అతన్ని స్నానం చెయ్యమనమ్మా, బ్రాహ్మణులంతా వచ్చి కూర్చున్నారు. ఇప్పటికే ఆలస్యమైపోయింది."

ఎవర్ని స్నానం చెయ్యమనటం? సుగుణకి దుఃఖం పొంగిపొర్లింది.

జగన్నాథం పంతులు గదిలోకి వస్తూ అంటున్నాడు

"ఏమోయ్, స్నానం కానీయ్—" గదిలోకి వచ్చి, అల్లుడు కనబడకపోయేసరికి అడిగాడు ఆయన ఆశ్చర్యంతో.

"ఇప్పు డెక్కడికెళ్ళాడమ్మా! ఇతను?" సుగుణ ఏమీ సమాధానం చెప్పలేదు.

"హోటలుకెళ్ళాడా ఏం?"

"ఇంటికి"

ఆశ్చర్యంతో చూశాడు, జగన్నాథంగారి కూతురి వైపు.

"ఇంటికా?"

"అవును. స్పష్టంగా చెప్పింది సుగుణ అబద్ధం.

"ఇప్పుడింటికి వెళ్ళటమేమిటి?"

కాసేపాగి సుగుణ అంది నెమ్మదిగా.

"ఇవాళ బొరసాలజరగదు నాన్నా, వారికేదో అర్జంటు పని ఉందట వెళ్ళిపోయారు" నిజం చెప్పటానికి సిగ్గుపడ్డది సుగుణ.

"అర్జంటుపనా!" జగన్నాధంపంతులు కూతురు ముఖం వైపు చూశాడు. దైన్యం, నైరాశ్యం తాండవించే ఆ ముఖం చూసి, లోకంతీరు తెలుసుకోటంలో తల నెరిసిన జగన్నాధంగారు అసలు సంగతి పసికట్టాడు. ఒక నిముషం ఆగి—

"ఏమైనా అన్నావా అమ్మా!" అన్నాడు ఆయన. సుగుణ కాలి బొటనవేలితో నేలరాస్తూ నుంచుంది, సమాధానం ఏమీ చెప్పలేదు.

"అంత మూర్ఖుడనుకోలేదమ్మా చంద్రం"

సుగుణ కళ్ళవెంబడి అశ్రువులు రాలాయి.

"అలిగిపోటానికి చిన్నవాడా, చితకవాడా? ఒకవేళ మాట అంటేమాత్రం తను పడదగినవాడుకాడా? యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం లేకుండా ఇలా మధ్యలో వెళ్ళిపోయి అవమానిస్తాడా? వంకర బుద్ధులు. ఆ వంశంలో ఎవరికీ ఇటువంటి నడతలు లేవు. బుద్ధిమంతుడనుకున్నాను. గాని..." ఉద్రేకంలో ఇష్టంవచ్చినట్లు మాట్లాడసాగాడు జగన్నాధం పంతులు.

"ఎందుకు నాన్నా, అనవసరంగా అనుకోటం..." అంది సుగుణ విచారంగా.

"ప్చ్, అంతేలే అమ్మా!" అన్నాడు నెత్తిమీద చెయ్యిపెట్టుకొని జగన్నాథం.

సుగుణ పాపాయి మంచంమీద కూర్చుని వాడి తల నిమిరింది. మనసులో ఏముందోగాని, వాడి తలవైపు కళ్ళార్ప కుండా చూసి వేదాంతిలా చిరునవ్వు నవ్వాడు. సుగుణకూడా నవ్వింది. పాపాయికోసం, అప్పుడే కాదు తరువాతకూడా సుగుణ నవ్వుతూనే వుంది. పాపాయికోసం, ప్రతిరోజూ రోజులు ఆమెను జాలిగా చూస్తూ జారిపోతున్నాయి.

"ఎన్నాళ్ళిలా?" రోజూ సుగుణ ప్రశ్నించుకుంటూనే ఉంది.

"ఎన్నాళ్ళిలా?" జగన్నాథం పంతులుకూడా చింతా స్వాంతుడుకాని రోజు లేదు.

జవాబులేని ఈ ప్రశ్నతో ప్రాణం విసిగి ఒకరోజు అన్నది.

"నేను వెడతాను నాన్నా?"

"నీ ఉత్తరానికి ఒక్కదానికికూడా అతను జవాబు రాయలేదుకదూ?"

సుగుణ తలవంచుకొని 'ప్చ్' అంది తనకేం వినబడ నట్టుగా.

"నువు వెళ్ళిమాత్రం ఏంలాభం?"

"ఎన్నాళ్ళిలా."

"ఆ మనోరమమీద భ్రాంతి వున్నంతకాలం అతనికి మంచీ, చెడూ తెలియదమ్మా."

కాసేపు నిశ్శబ్దంగావుండి, సుగుణ ఏదో నిశ్చయించుకున్నదానిలా అంది దృఢంగా.

"వెడతాను. మన పాలేరును బండికట్టమను నాన్నా!" జగన్నాథంపంతులు కూతురి ముఖంలోకి చూసి మరేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు అక్కణ్నించి.

కాసేపటిలో బండి వచ్చింది. సుగుణ పాపాయితో సహా ఒకర్తె బయలుదేరింది. తండ్రిని రావద్దన్నది. తనువెళ్ళే చోట యెటువంటి అవమానం ఎదుర్కోవాలో, తన అవమానాన్ని చూసి ఆయన ఎ త బాధపడతాడోనని ఒంటరిగా వెళ్ళడానికే సిద్ధపడ్డది సుగుణ. పల్లెటూరి దాటి ముప్పయి నిమిషాలయినా కాకుండానే మూడున్నరమైళ్ళ పట్నంచేరింది బండి. దడదడ కొట్టుకొనే గుండెతో బండిదిగి జంకుతూ తలుపు నెట్టింది సుగుణ. లోపల సోఫాలో యెవరో యువకుడు కూచుని ఉన్నాడు.

సుగుణను చూసి అతను ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి అన్నాడు:

"ఎవరికోసమండీ."

సుగుణకి ఒక్కసారిగా ముచ్చెమటలు పోశాయి.

"ఈ ఇల్లు అద్దెకిచ్చారేమో!" అనే ఆలోచన తట్టిందామెకి అకస్మాత్తుగా తడబడుతూ అన్నది.

"మీ... మీరు... ఈ. ఇంట్లో అద్దెకుంటున్నారా" ఆ యువకుడు సుగుణవైపు ఒక్కక్షణం పరకాయించి చూసి,

లేదన్నట్టు నెమ్మదిగా తల తిప్పాడు. సుగుణకిదంతా అయోమయంగా ఉన్నది. 'ఎవరో స్నేహితుడు కాబోలు' అని సమాధాన పరచుకొని అడిగింది.

"రామచంద్రరావుగారు..." తరువాత ఏమనాలో స్ఫురింపక ఆగింది సుగుణ.

ఆ యువకుడేదో జ్ఞాపకం తెచ్చుకున్నట్లు 'ఓహో... మీరు...ఆయన తాలూకా. సారీ—'

"అవును" అన్నది సుగుణ అతని ఉద్దేశం గ్రహించి. అతడామెవేపు ఎగాదిగా చూసి 'మీరేనా!' అన్నాడు. ఆ అనటంలోని ఎగతాళి సుగుణకి స్పష్టంగా అర్థమయింది.

"కూర్చోండి, లోపలికి రండి. చంద్రంగారు బయటకి— అరె, మాటల్లోనే వచ్చేశారే చంద్రంగారు" సుగుణ తలఎత్తి వాకిలివైపు చూసింది. చంద్రం అదే సమయంలో సుగుణ వైపు చూశాడు. బయటనుంచి వస్తూ సుగుణ కళ్ళు పక్కకి త్రిప్పుకుంది. చంద్రం ఆమెవైపు నఖశిఖపర్యంతం ఒక్కసారి తీక్షణంగా చూశాడు. సుగుణ యేదో చెప్పాలనుకుంది. బండిలో ఏమేమో ఆలోచించుకుంది. కాని అవన్నీ మర్చిపోయింది అకస్మాత్తుగా.

"ఇవాళ ఇంత ఆలస్యంగా వచ్చారేం చంద్రంగారూ! మా మనోరమ ఇందాకటినుంచీ మీకోసం కనిపెట్టుకు కూర్చుంది. త్వరగా వెళ్ళి భోంచెయ్యండి."

"ఆ ఇల్లు కట్టించే ఉత్సాహంలో ఈ యింటి సంగతి మర్చిపోయినట్టున్నారు."

మెట్లమీదనుంచి వినవచ్చిన ఈ సన్ననిగొంతు విని సుగుణ తలెత్తి చూసింది. ఓ అందమైన యువతి కనపడ్డది.

"పనివాళ్ళు వెళ్ళటం ఆలస్యమయింది రమా" అన్నాడు చంద్రం ఒక్కక్షణం సుగుణ సంగతంతా మర్చిపోయి.

"ఈవిడే కాబోలు మనోరమ" అనుకుంది సుగుణ. మెట్లు దిగివచ్చిన సుగుణని హఠాత్తుగాచూసి తెల్లబోయింది: చంద్రంవైపు ఒకసారి తీక్షణంగా చూసి చివాలునమెట్లవైపు పరిగెత్తింది. చంద్రం ఆమెని అనుసరించటానికి అడుగుముం దుకువేశాడు.

"చూడండీ" హీనస్వరంతో అంది సుగుణ.

చంద్రం తల వెనక్కి త్రిప్పి సుగుణవైపు చూసీ చూడనట్టు చూశాడు.

"నేను వచ్చాను" అంతకంటె ఏమనాలో ఆమెకి తోచలేదు.

"చూశాను"

సుగుణ అవమానంతో తల దించుకుంది. తను యేం చేసిందని యింత అవమానం చెయ్యటం! ఆమె కడుపులో మంట పుట్టింది. అతనివైపు సూటిగా తీక్షణంగా చూస్తూ అంది.

"ఉండటం మీ కయిష్టంకాకపోతే ఉంటాను" ఈ మాటలు అని సుగుణ చాలా సిగ్గుపడ్డది. ఆమె ముఖం ఎఱ్ఱ బడ్డది. తను యెంత తక్కువకి దిగజారాలో అంతవరకూ జారింది.

"ఆత్మాభిమానం కలవారెవరైనా ఆ మాటనగలరా" అని కించపడ్డది ఆమె.

"నీయిష్టం" అన్నాడు చంద్రం.

ఈ మాటలతో సుగుణ అభిమానం పూర్తిగా దెబ్బ తిన్నది. తను అహం ఎంత చంపుకుని, ప్రయత్నపూర్వకంగా సహనం చూపిస్తోందో అతను అంతగా తనను అవమానిస్తున్నాడు. అందులో పరాయి పురుషుని ఎదుట.

వెంటనే గిరుక్కున తిరిగి పోదామనిపించిం దామెకి. కాని స్థిమితపడి ఆలోచించి, "ఎన్నాళ్ళక్కడ ఉండగలను?" అని అధైర్యపడి ఆ ఇంట్లోనే ఉండటానికి నిశ్చయించుకుంది. ఆమె ఆలోచనలో చంద్రం అక్కణ్ణించి వెళ్ళిపోవటం గమనించలేదు. కాసేపటి తర్వాత, తలెత్తి చూసి అతను వెళ్ళిపోయాడని గ్రహించి ఏమీ తోచక, చివరికి ప్రక్క గదిలోకి వెళ్ళి కూలబడ్డది.

"చంద్రం ప్రవర్తన నాకేమీ బావుండలేదమ్మాయి"

ఆశ్చర్యరంగా తలెత్తి చూసింది సుగుణ. ఇందాకటి యువకుడు గది గుమ్మందగ్గిర నిలబడివున్నాడు. చప్పున ఆమె తలదించుకొని చూపులు మరల్చుకుంది.

"నిజం చెబుతున్నాను. మా మనోరమ నీకంటే ఏమంత అందంగా ఉందని? ఆ మాటకొస్తే నీ అందంలో నూరోవంతు కూడా దానికిలేదు. చంద్రం ఇంత పిచ్చివాడయాడేమిటా అని ఆలోచిస్తున్నాను."

సుగుణకి ఈ సంభాషణ ఏమీ నచ్చలేదు. ఆమెకి ఆ సమయంలో ముఖ్యంగా ప్రశాంతత కావాలి. చెదరిన మనస్సుని కుదుటపర్చుకోవాలి.

సుగుణ దగ్గర్నించి ఏమీ ప్రత్యుత్తరంగాని, కనీసం తన మాటల్ని శ్రద్ధగా వినే ఆశక్తిగాని లేకపోవటంతో ఆ యువకుడు మరో రెండు క్షణాలు అక్కడ నుంచుని తర్వాత వెళ్ళిపోయాడు.

సుగుణ తన గడచిన రెండు సంవత్సరాల చరిత్రనీ సింహావలోకనం చేసుకుంది. హృదయాధిపత్యంకోసం ఆశించి కలలు కంటే, చివరికి హృదయంలో ఓ మూల కాస్త చోటుకోసం పాకులాడాల్సొచ్చింది. అదే తన గడచిన చరిత్ర.

ఆ మధ్యాహ్నం ఆమె భోజనం చేసిందో లేదో కనుక్కున్న వాళ్ళెవరూ లేరు. అయినా ఎవరుంటారు చంద్రంని మినహాయించి. ఆమె స్థితి గతులు కనుక్కోవాలిసిన అవసరం ఆ ఇంట్లో ఎవరికుంది? చంద్రకి ఆమె భోజనం సంగతి జ్ఞాపకం లేదు. మూడుగంటలికి కాఫీతాగినప్పుడు మాత్రం సుగుణ భోంచేసిందో లేదో అనే విషయం అతనికి అకస్మాత్తుగా తట్టింది. "ఇంటిదగ్గర భోంచేసి వచ్చి వుంటుంది." అని సమాధాన పరుచుకున్నాడు.

ఆ రోజు శనివారం కావటంవల్ల ఏదో సినిమాకి వెళ్ళి తీరాలి. అదీగాక సుగుణవిషయంలో మనోరమని కాస్త బతిమాలుకోవలసి రావటంవల్ల సినిమా ప్రయాణం మరీ తప్పనిసరయింది. మొదటి ఆటనుంచి తిరిగొచ్చి మేడ ఎక్కబోతున్న సమయంలో "కేర్" మని యేడ్పు వినబడ్డది చంద్రంకి. అంత

వరకూ అతనిస్మృతిలో సుగుణ అదృశ్యమయింది. తటాలున ఈ ఏడ్పువిని సుగుణని గురించి ఆలోచించాడు చంద్రం. ఆమె ఇక్కడికి రావటం అతనికి ఎంతమాత్రం ఇష్టం లేదు. కాని ఆమెను గట్టిగా ఇక్కడ ఉండటానికి వీల్లేదనటానికి ధైర్యం చాలలేదతనికి ఈ ఆలోచనలలో సుగుణ ఈ రాత్రి అన్నం తిని ఉండదనే విషయం అతనికి అకస్మాత్తుగా తోచింది. ఎలా తింటుంది? ఏ దేవతలో కరుణించి ఆమెగదిలోకి ఆహారం పడేసే కాలం కాదుగా ఇది! అతనికి జాలివేసింది. సుగుణ గదివైపు వెళ్ళాడు. గదిలోంచి తొంగిచూశాడు. వళ్ళో పిల్లవాడిని పడుకోబెట్టుకుని కూర్చుంది సుగుణ.

"అన్నం తిన్నావా?" అర్థంలేని ప్రశ్న అడిగాడు.

సుగుణ ఉలిక్కిపడి తలెత్తి చూసింది. వెంటనే మళ్ళీ తలకిందికి దించుకుని హీనస్వరంతో అన్నది:

"ఆకలి లేదు"

నిజానికి ఆమెకి ఆకలిగానే ఉన్నది. ఆకలిగా లేదంటే ఎవరూ బతిమాలరని కూడా ఆమెకు తెలియకపోలేదు. కాని "ఆకలి లే"దందామె, అనాలనే

చంద్రం ఏం మాట్లాడలేదు. కాసేపు అలాగే నుంచున్నాడు. తరవాత వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన చప్పుడు విని సుగుణ అతనివైపు శూన్యంగా చూసింది.

గడియారం పదిగంటలు కొట్టింది. సుగుణ లేచి పిల్లవాడిని సోఫాలో పడుకోబెట్టి తను సోఫాకి ఆనుకుని కిటికీలోంచి

మేఘాలు కమ్మిన ఆకాశంలోకి చూడసాగింది. ఆ రాత్రి గడియారం కొట్టిన గంటలన్నీ విందామె.

తెల్లవారింది. అయినా సుగుణ అలాగే కూర్చునిఉంది. ఆమెకి ఏం చెయ్యటానికీ తోచటంలేదు. ఆ ఇంట్లోని ప్రతి వస్తువూ ఇప్పుడు తనది కాదు.

"అదేమిటమ్మాయ్, రాత్రల్లా ఇలాగే కూర్చున్నావేమిటి?"

తల తిప్పకుండానే నిన్నటి యువకుడు గొంతు ఆనవాలు పట్టింది సుగుణ. ఆమె ప్రత్యుత్తరం ఇవ్వటం అవసరమనుకోలేదు.

"చూస్తే, రాత్రి అన్నంకూడా తిన్నట్టులేవు?"

ఈ సారికూడా జవాబు చెప్పలేదు సుగుణ.

"చంద్రం ఇంతటి పశు వనుకోలేదు మెత్తటి వాళ్ళని చూస్తే ఎవరికైనా ఇంతేలే."

కాసేపటి తరవాత సుగుణ తలెత్తి చూసేసరికి ఆయువకుడక్కడ లేడు. మరి కాసేపటిలో లోపల యేవో కేకలు వినిపించాయి, తరవాత సుగుణ గదిలోకి వంటసామాగ్రి అంతా చేరింది.

"చంద్రంకి ఈ మాత్రం జ్ఞాపకం లేకపోవటం ఆశ్చర్యంగా ఉంది." అన్నాడు సామాను చేరవేస్తూ ఆ యువకుడు. సుగుణ అతనికి మనసులో కృతజ్ఞత చెప్పింది.

"చూడమ్మాయ్, నాపేరు భూషణ మంటారు, నీకేమైనా కావాలిస్తే నాతో చెప్పు, క్షణంలో చేసిపెడతాను."

సుగుణ మర్యాదకి తల తిప్పింది. కాని ఆ యువకుడు తనపట్ల ఇంత శ్రద్ధతీసుకోవటం ఆమె కేమాత్రం ఇష్టంలేదు.

పగలూ, రాత్రీ వరసప్రకారం వస్తూ, పోతూ ఉన్నాయి. రాత్రింబగళ్ళ తేడాలో సుగుణకి ఉత్సాహమేమీ లేదు. ఆ ఇంటో ఆ భూషణాన్ని మినహాయిస్తే తన సంగతి కనుక్కునే వాళ్ళెవరూ లేరు. చంద్రం తను ఎదుట చీదరించుకుంటున్నాడు. స్వతహాగా అతి సిగ్గుగల స్వభావమేమో, భూషణంతో మాట్లాడటానికి ఆమెకి ఇష్టంలేదు.

చూసిచూసి, ఓ రోజున అడిగేశాడు భూషణం.

"నాపట్ల నీకింత అయిష్ట మెందుకు?"

బాపుండదని సుగుణ అన్నది.

"అయిష్ట మేముంది?"

"అయితే ఇష్టమేనా?"

అతని తరహాచూసి 'ఎందుకలా అన్నానా?' అని పశ్చాత్తాప పడ్డది.

"సుగుణా!"

సుగుణ అదిరిపడ్డది. తను వచ్చిన ఈ పది, పదిహేను రోజుల్లోనూ పేరుపెట్టి ఎప్పుడూ పిలవలేదు భూషణం. ఆ పిలుపుతో ఆమె కేదో అశుభసూచకం గోచరించింది.

"విషయం చంద్రంతో మాట్లాడాను, కాని అతని సుతరామూ నామాటలు చెవికెక్కించుకో లేదు. అతను వైఖరి చూస్తే నాకు పరమ అసహ్యంవేసింది. నీపేరువింటేనే అతను చిర్రుబుర్రు లాడుతున్నాడు."

"మీరు నన్ను గురించి పడ్డ శ్రమకి మీకు చాలా కృతజ్ఞురాలిని. కాని నా తరఫున వారితో మాట్లాడవద్దని మిమ్మల్ని వేడుకుంటున్నాను."

"అతని మనస్సేమైనా మారుతుందేమోనని ఆశించాను. కాని 'ఆవిడతో నాకేమీ సంబంధం లేదు.' అని నిష్కర్షగా చెప్పాడు. అతను అంత టెక్కుగా ఉన్నప్పుడు నువ్విలా అతని అడుగులికి మడుగులొత్తటం ఏమీ బావుండలేదు. అతను చేసిన అన్యాయానికి నువ్వు ప్రతీకారం చేస్తేనే కాని అతనికి చెప్పుతో కొట్టినట్టుండదు."

ఈ ఉపన్యాసం సుగుణ ఎంత మాత్రం వినదల్చుకోలేదు.

"నన్నిలా ఉండనియ్యండి." అందామె కొంచెం చిరాకుగా.

"నిన్ను పురుగులా విదిలించిపారేసే వాడి కాళ్ళు పట్టుకోవటం నీకేమంత ఘనం? నీ అనుగ్రహం కోసం నీ కాళ్ళు పట్టుకునే వాళ్ళెంతోమంది ఉన్నారు."

చివరిమాటలకి సుగుణ బుస్సుమంది.

"దయచేసి మీరు ఇటువంటి మాటలు నాకు చెప్పకండి."

"సుగుణా! నువ్వలా కోపగించుకుంటే ఎలా? మనస్ఫూర్తిగా చెబుతున్నాను, విను. నీ చల్లని చూపుకోసం నీ గుమ్మందగ్గర పడిగాపులు కాస్తున్నాను. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. నా మాట విను."

సుగుణ తీక్షణంగా అతనివైపు చూసింది.

"ఈ సారి ఇటువంటి మాటలు రానిస్తే వారితో చెబుతాను. మర్యాదగా వెళ్ళండి."

భూషణం తల పంకించాడు.

"ఈ ఇంట్లో నామాట కాదనేవాళ్ళు ఎవరూ లేరని నువ్వు ముందే తెలుసుకోవటం మంచిది"

ఎర్రబడ్డ అతని కళ్ళనీ, కటువుగా వినవచ్చిన అతని మాటల గంభీర్యాన్నీ చూసి నిలువునా వణికింది సుగుణ.

"నన్నిలా బాధించటం మీకు భావ్యంకాదు." అన్నది జాలిగా.

"నీకోసం నేనెంత బాధపడుతున్నానో నీకు తెలియదు సుగుణా. నామాటలు కాదనకు. చంద్రంని చూసి భయపడుతున్నావేమో! అతను నా గుప్పిటలో ఉన్నాడు. క్షణంలో అతన్ని పిల్లిలా చెయ్యగలను."

"ఈ సారి సుగుణకి భయంపోయి ఏహ్యాం, కోపం కలిగాయి.

"మాటలతో వెళ్ళదలచుకోలేదా?" కటువుగా అంది.

ఆమెవైపు తన ఎర్రటి కళ్ళతో చూసి తల నిలువుగా ఆడించి:

"తెలిసివస్తుంది లే, హుం" అని చర్రున వెళ్ళిపోయాడు భూషణం.

భూషణం వెళ్ళిన పదినిమిషాలకి చంద్రం ఇంట్లో అడుగు పెట్టాడు చంద్రంతో భూషణం విషయం ముందే చెప్పకపోతే

తన కేదో కీడుమూడుతుందని అనుమానించింది సుగుణ. అతను తనగది దగ్గిరికి రాగానే, ఆమె తలుపు దగ్గిరికి వచ్చి చంద్రం వైపు చూచింది.

"ఒకసారి ఇలా వస్తారా."

చంద్రం కాసేపు తటపటాయించి గడితలుపు దాకా వెళ్ళి,

"ఎందుకు?" అన్నాడు. సుగుణ విషయం చెప్పటానికి కొంచెం సందేహించింది.

"అవతల నాకు చాలా పనుంది. త్వరగా తేల్చు" అన్నారు విసుగ్గా.

"భూషణంగారిని చూస్తే నాకు భయంగావుంది." అంది నెమ్మదిగా.

"ఎందుకు భయం? నిన్ను ఎత్తుకుపోయేటంత మూర్ఖుడు కాడులే."

"ఎందుకో నా కాయన్ని చూస్తే భయంవేస్తోంది."

"అయితే నన్ను కాపలా కూచోమంటావా? లేకపోతే ప్రత్యేకంగా గూర్ఖావాణ్ణి నియమించాలా."

"అదికాదు."

"ఏది కాదు, నీమొహం. మహా పతివ్రతలా ఇక్కడ నన్ను పట్టుకొని వేళ్ళాడమని ఎవడేడిశాడు లేకపోతే..."

సుగుణకి కళ్ళవెంబడి నీళ్లు తిరిగాయి.

"మాట్లాడితే ఏడుపూ, ఛీ." కసురుకుని చరచర నడిచి పోయాడు చంద్రం. బరువుగా క్రింద కూలబడ్డది సుగుణ. విచారంలో ఆమెకి ఎంతసేపు తను అలాకూర్చుందీ తెలియదు.

"సుగుణా!"

ఉలిక్కిపడ్డది సుగుణ. ఎదురుగానుంచున్న భూషణాన్ని చూసేసరికి ఆమెకి ప్రైణాం పైనే పోయింది. మసక చీకటి అప్పుడే అలుముకుంది.

"ఏంచేస్తావు నా మనవిని?"

సుగుణ భీతితో లేచి నుంచుంది.

"ఇంత అందగత్తెవి? నిజంగా చంద్రానికి కళ్ళులేవు సుగుణా!"

"భూషణంగారూ! మీకాళ్లు పట్టుకుంటాను. అటువంటి మాటలనకండి."

భూషణం పొడిగా నవ్వాడు.

"నేనే నీ కాళ్ళు పట్టుకోటానికి వచ్చాను సుగుణా—"

కోపంతో ఎర్రబారిన ఆమె ముఖంచూసి మరింత పరవశుడై భూషణం ఆమెచెయ్యపట్టుకోటానికి ముందుకు వెళ్ళాడు. సుగుణ కేకలు వెయ్యటానికి ప్రయత్నించింది.

"అల్లరి పెడతావా?" గద్దించాడు భూషణం.

అసహాయంగా దిక్కులు చూసింది సుగుణ.

"ఇవాళ శనివారం. అంతా సినిమాకెళ్ళారు. ఎవరికీ తెలియదులే. నా ప్రేమని కాదనకు."

ఈ మాటలు వినేసరికి మిగిలినకాస్త ఆశా కూడా ఎగిరిపోయింది సుగుణకి. గత్యంతరం లేక, మీదమీదకొస్తున్న భూషణాన్ని గరిటె తీసుకొని తలమీద గట్టిగాకొట్టింది. దెబ్బ తిని భూషణం మరింత రౌద్రమూర్తి అయినాడు. అతను తల తడుముకునే లోపల చురుగ్గా గదిదాటి వీధివైపు పరిగెత్తింది సుగుణ. చేసేదిలేక బుసలుకొడుతూ భూషణం లోపలికెళ్ళిపోయాడు.

రాత్రి చంద్రం, మనోరమా సినిమానుంచి తిరిగొచ్చేదాకా వీధి అరుగుమీదే కూర్చుంది సుగుణ. చంద్రం బండి దిగి లోపలికి వెడుతూండగా ఆమె కూడా అతని వెనకాలే వెళ్ళింది. చంద్రం సుగుణని చూసి ఆశ్చర్యపడ్డాడు. కాని అతను ఆమెనేమీ అడగలేదు. తన గది దాటిపోతుంటే సుగుణ అంది కర్కశంగా.

“భూషణాన్ని జాగ్రత్తగా మసులుకోమనండి.”

ఈ కఠోరస్వరాన్ని విని చంద్రం, మనోరమా చకితులైనారు. చంద్రం వెనక్కి తిరిగి సుగుణవైపు చూశాడు. ఆమె పెదవులు వణుకుతున్నాయి.

“ఇవాళ దెబ్బతో సరిపోయింది. ఉద్రేకంలో రేపు ప్రాణమే పోవచ్చు.”

సుగుణని ఈ రూపంలోగాని, ఆమె నోటంట ఇంత కఠినంగా మాటలు రావటంగాని చంద్రం ఎరుగడు.

“ఇంతింతలేసి మాటలు మా అన్నయ్యనే!” మనోరమ చంద్రంవైపు బిక్కమొహంతో చూసి అంది.

"మీ అన్నయ్యో, తమ్ముడో నాకు తెలియదు. ఇది సానికొంప అయితే కావచ్చు. కాని సంసారులు కూడా ఉన్నారు. తర్వాత పశ్చాత్తాపపడితే లాభం లేదు."

మనోరమ తనవైపు నిస్సహాయంగా ప్రణయకోపంతో చూసేసరికి చంద్రానికి కాస్త వేడికలిగింది.

"సుగుణా!" అన్నాడు కోపంగా.

సుగుణ యిప్పుడు యెంత చిన్న అవమానకరమైన మాటనీ సహించేస్థితిలో లేదు.

నుండే కళ్ళని చంద్రంవైపు తిప్పిందామె.

"ఏమి టీ వాగుడు?"

"మానాభిమానాలుగల ఏ ఆడదైనా ఇలాగే వాగుతుంది ఈ సందర్భంలో."

"మానాభిమానాలుంటే, వద్దన్నకొద్దీ యిలా వాళ్ళ మీద యెందుకు పడతావు?" అంది మనోరమ కసితీర్చుకుంటూ.

"మానాభిమానాలంటే నీకు తెలియకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు" అప్రయత్నంగా అంది సుగుణ. తర్వాత ఆ మాటలు అన్నందుకు చాలా విచారించింది.

"నోరు ముయ్యి" అన్నాడు చంద్రం.

సుగుణ యిప్పుడు మాటలుపడేస్థితిలో లేదు. ఉద్రేకం కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది ఆమెలో.

"భూషణాన్ని అలా గద్దించగల సాహసం ఉంటే మీకు నన్నలా అని వుండదు."

"ఈవిడతో కలిసి ఈఇంట్లో నే నింకా ఒక్క రోజుకూడా ఉండలేను" అంది మనోరమ.

"సుగుణా! రేపు ప్రొద్దున్నే నువ్వు ఇక్కణ్నించి వెళ్ళి పోవచ్చు. ఇహ జీవితంలో నీ ముహం నాకు చూపనక్కర లేదు. కావాలంటే భరణం ఇస్తాను".

చివరిమాటలు చంద్రం అనివుండకపోతే సుగుణ యింకా దులిపి ఉండేది. కాని చంద్రం అన్న ఆఖరుమాటలు ఆమెని ఒక్కసారిగా కుంగదీశాయి. భరణం! తిండికోసమా తను వివాహమాడింది?

"మీరిచ్చే భరణానికి నాలుగురెట్లు మా నాన్నగారు మీకియ్యగలరు" ఆవేశంతో అంది సుగుణ. 'పెళ్ళిచేసుకున్నది భరణం ఇవ్వటానికా? ఆనాటి వాగ్దానాలన్నీ అంత అకస్మికంగా మర్చిపోయారా?'

"నాకు జ్ఞాపకం ఉన్నంతలో నే నేమీ వాగ్దానాలు చెయ్యలేదు."

"పెళ్ళినాడు మీరు జరిపిన మంత్రాలు..."

"అదా! నాకు సంస్కృతం రాదు."

మనోరమ నవ్వింది. ఈ ఒక్క చెణుకుతో ఆమె అవమానం అంతా తీరినట్టు భావించుకుంది.

ఆ రాత్రి మొదటిసారిగా సుగుణ వెక్కి వెక్కి ఏడ్చింది అంతవరకూ ఆమె కళ్ళల్లో కన్నీళ్లు తిరగటమేగాని, బరువంతా తీరేట్టు దుఃఖించటం జరగ లేదు.

తెల్లవారగానే సుగుణ పుట్టింటికి బయలుదేరింది. నెల రోజులైనా కాకుండా కూతురు తిరిగి రావటం చూసి, జగన్నాథరావుపంతులు గుండె గుబుక్కుమంది.

బండిదిగి సరాసరి ఇంట్లోకి వెళ్ళిపోయింది సుగుణ. జగన్నాథంపంతులు ఆమె వెనకాలే ఇంట్లోకి వెళ్ళాడు. సుగుణ కిటికీలోంచి శూన్యంలోకి చూస్తోంది.

"అమ్మాయి!"

సుగుణ అతనివైపు చూసి, కళ్ళు తుడుచుకుంది.

"మళ్ళీ ఏమైనా..."

సుగుణకి అపుకోలేనంత ఏడుపొచ్చింది. వలవల ఏడ్చేసింది. కూతురు తల నిమురుతూ అన్నాడు జగన్నాథం పంతులు.

"దీనికంతా కారణం డబ్బమ్మా. అది పోయినక్షణంలో తెలిసొస్తుంది అతనికి. డబ్బుయిపోగానే కుక్కని తరిమినట్లు తరుముతుంది ఆ మనోరమ అతన్ని. ఏమిటో అనుకుంటున్నాడు గావును."

సుగుణ ఏడుపు ఆపుకోవాలని వ్యర్థప్రయత్నాలు చేసింది.

"మనసులో వుంటుందిగాని, డబ్బేంచేస్తుంది నాన్నా.

"అదేనమ్మా. మనసు గట్టిదికాకపోతే డబ్బు దాన్ని ఇష్టంవచ్చినట్టు ఆడిస్తుంది. డబ్బు పోయిననాడుగాని తెలీదు దాని మజా. అతనికి బుద్ధిరావాలంటే ఒకటే మార్గం"

సుగుణ ఆశతో చూసింది తండ్రివైపు.

"మైనరు దావా వేస్తాను."

ఆఁ!" అంది సుగుణ భయంతో, ఆశ్చర్యంతో.

"అవును"

"వొద్దు నాన్నా, ఈ దావాలు, పరువుపోటం అలా వుంచి, అసలు పూర్తిగా తెగిపోతుంది."

"లేదమ్మా. నేను బాగా ఆలోచించే చెబుతున్నానుసి ఏదో ఇల్లు కట్టిస్తున్నాడన్నావు గదూ. సగం ఆస్తి అమ్మేం ఉంటాడు. లేదా సగం ఆస్తి మేడకి అప్పు తెచ్చయినా ఉ. టాడు. సగం ఆస్తి కొడుక్కి పంచమని దావా పడేస్తాను. దుబారాఖర్చులు చేస్తున్నాడనీ, అవి మైనరుకి నష్టదాయక మనినీ."

సుగుణ కాసేపాలోచించింది. డబ్బు పోతేనైనా తన తప్పు తెలుసుకుంటాడేమో!

"సరే నాన్నా"

"రేపే పడేస్తాను. సగం ఆస్తి ఎలాగో కరారావడి అయిఉంటుందిలే. మిగతా సగం వీడికొస్తే ఇహ చిప్పచేత్తో పట్టుకుని చేసిన తప్పుల్ని నెమరేసుకుంటాడు" సుగుణ సరే నందిగాని ఆమె మనసులో బెరుగ్గానే ఉంది. దీనివల్ల యేం విపరీతఫలితాలు కలుగుతాయోనని.

మర్నాడు కొడుక్కి ఆస్తి పంచమని రిజిష్టరు నోటీసు ఇప్పించాడు జగన్నాథంపంతులు రామచంద్రానికి. నోటీసు

చూసుకుని "ఇదేదో బెదిరింపులే" అనుకున్నాడు చంద్రం. కానీ వారంరోజుల తర్వాత పార్టిషన్ దావా పడేసరికి అతను ఓ ప్లీడరు దగ్గరకు వెళ్ళాడుసలహాకోసం. ప్లీడరుగారు ఒకక్షణం కనుబొమ్మలు చిట్లించి, ఆలోచించి అన్నాడు.

"మీరు చేసిన ఖర్చులుచూస్తే, ఆ స్త్రీని పంచక తప్పదేమో ననిపిస్తోంది."

చంద్రానికి గుండెల్లో రాయిపడ్డది. ఒకటి రెండు రోజులక్రిందటే తను కొత్తగా కట్టిన ఇల్లు పూర్తయింది. దాని కోసం బోలెడంత అప్పుచేశాడు. పైగా ఒచ్చిన పెద్దచిక్కేమిటంటే ఆ ఇల్లు కట్టిన స్థలం, ఇల్లూ అంతా మనోరమపేరే ఉన్నాయి. డబ్బు దుర్వినియోగం చేసినట్లు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఇప్పుడు ఆ స్త్రీపంపిణీ జరిగితే తనకి మిగిలేది ఇహ ఏమీ వుండదు. అతను దైన్యంగా ప్లీడర్ గారి ముఖంలోకి చూశాడు. ప్లీడరుగారు అతని వైఖరి చూసి అన్నాడు.

"ఒక విషయం అడుగుతాను. మీకు కోపం రాదు గదా!"

"అడగండి."

"మీ భార్యని మీరు వదిలేసినట్టేనా?"

చంద్రం తక్షణం ఏమీ జవాబు చెప్పలేకపోయాడు.

"చెప్పండి. ఈ రహస్యాలు నాకూ, మీకూ తప్ప ఎవరిచెవినీ పడవు. పరవాలేదు చెప్పండి"

"ఏమో" అన్నాడు చంద్రం.

"మనసులో ఉన్నమాట చెప్పండి"

"ఆ అవకాశం ఏమీ లేదేమో!" అన్నాడు చంద్రం. ఈ మాట అంటున్నప్పుడు అతనికి ఒక్క క్షణం సంకోచమూ, కొద్దిగా బాధా కలిగినమాట వాస్తవం.

"ఆ అవకాశం ఏమాత్రమూ లేనట్టయితే ఒక సలహా చెబుతాను."

"ఏమిటది?"

"మీ రేమీ అనుకోకూడదు. మా వృత్తి ధర్మాన్ని అనుసరించి మేం సలహాలు ఇస్తూంటాము. ఆచరించటం, ఆచరించకపోవటం మీ ఇష్టాయిష్టాలనుబట్టి వుంటుంది."

"చెప్పండి"

"మీ భార్యతో మీరు కాపరం చెయ్యకపోవటానికి కారణం?"

"ముందరే చెప్పానుగా, మనోరమ అనే వేశ్యమీద నా మనసు పోయింది."

"అంతేనా కారణం? లేక—"

"అంతే"

"ఇంకేమీ లేదా?"

"ఊహుఁ"

"మీ భార్య చాలా ఉత్తమురాలనుకుంటాను"

"అంతే—"

"ఆవిడ మంచిదే పాపం"

"జగన్నాథంపంతులుగార్ని నేనెరుగుదును. వారి అమ్మాయికూడా ఆయనంతటి గుణవంతురాలనే—"

'గుణనంతురాలు' అన్నప్పుడు నొక్కిపలికాడు ప్లీడర్.

"అదంతా ఎందుకులెండి ఇప్పుడు."

"ఇదివరకు ఇలాంటికేసు ఓటి నడిపాను. నేను గెలిచానుకూడా. ఇలాగే పార్టిషన్ దావాపడేశాడు మనవడి తరపున తాత. మైనరు నాకు కొడుకు కాదన్నాడు రెస్పాండెంటు ఫైనల్."

"ఛీ" అన్నాడు చంద్రం. "ఛీ...ఛీ—అదా. ఇందాకటినుంచీ మీరనేది. ఛీ."

"కేసు గెలవాలంటే అదొక్కటే మార్గం."

"అయితే ఓడిపోతాను లె ండి."

"బాగా ఆలోచించుకోండి. మీయిష్టం. అయితే రేపట్నుంచి మీచేతిలో చిల్లిగవ్వకూడా వుండదు. మనోరమ అన్నారే, ఆవిడ మిమ్మల్ని అసలు దగ్గిరికే రానివ్వదు."

మనోరమ! ఈ నాలుగక్షరాలు చంద్రం ప్రాణంకంటె ప్రియతమాలు.

"అంత అన్యాయం ఎలా చేయమంటారు!" అన్నాడు కొంచెం తగ్గి చంద్రం.

"ఇప్పటిదాకా మీరుచేసింది న్యాయమా?"

చంద్రంకి సమాధానం దొరకలేదు.

"అసలు ఋజువు ఎలా చేయగలం?"

"అదంత పెద్ద కష్టం కాదని నా అభిప్రాయం"

"నామనస్సు ఒప్పుకోటంలేదండీ. అంత ద్రోహం ఎలా చెయ్యమంటారు?"

"నే నేమీ చెయ్యమనటం లేదు. ఉన్న సంగతి చెప్పాను. మీ యిష్టం వచ్చినట్టు చెయ్యొచ్చు."

చంద్రం మనస్సు ఉయ్యాలలూగింది.

"ఆన్సర్ పడెయ్యనా?" అన్నాడు ప్లీడర్ అతనిమనస్సు కనిపెట్టి.

"మీయిష్టం." అన్నాడు చంద్రం ప్లీడర్ వైపుచూసి.

"సరే, ఇహమీరు వెళ్ళొచ్చు."

చంద్రం బరువుగా లేచాడు. నడుస్తున్నాడేగాని అతని మనసు మనసులోలేదు. ఏదో తీరని అపచారం చేస్తున్నట్టుగా భావించాడు. తన అంతరాత్మకి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నట్టు అనుభూతి పొందాడు. ఆలోచనలు ఎక్కువైనకొద్దీ అతనికి కోపంకూడా ఎక్కువైంది.

"అయినా, వాళ్ళు చేజేతులా చేసుకున్నదే ఇది. తనని బహిరంగంగా కోర్టుకు ఈడ్చి తనకి ఎవరో వేశ్యతో సంబంధం ఉందని నిరూపించి తనని అపఖ్యాతిపాలు చేయటానికేగా ఈ ప్రయత్నం! చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత. అనుభవించని.

ఈవిధంగా తనని తను సమర్థించుకున్నాడు. కాని తన సంతృప్తిలో ఏదో వెలితి, ఏదో కుంటితనం, ఏదో మాధ్యం ఉందని అతనికి చూచాయగా తెలుసు. కాని తను అనుసరించిన మార్గం న్యాయమైనదేనని వాదించుకున్నాడు మనసులో. అలా వాదించుకోనటంవల్ల అతనికి సంతృప్తి కలగకపోగా

మరింత అసంతృప్తి కలిగింది. ఆరాత్రంతా అతనికి బాధతో నిద్రపట్టలేదు. ఏవో పిచ్చి పిచ్చి కలలొచ్చాయి. చాలాసార్లు, "అవును. వాళ్ళకలా శాస్తి కావలిసిందే" అని తన మనసులో అనుకున్నాడు.

చంద్రంప్లీడర్ ఆన్సర్ పడేశాడు. ఆన్సర్ చూసి జగన్నాథం పంతులు దిమ్మెరపోయాడు. అల్లుడు ఇంత దౌష్ట్యానికి ఒడిగడతాడని ఆయన ఊహించుకో లేకపోయాడు. తన ప్లీడర్ దగ్గిర్నుంచి ఆన్సర్ కాపీ తీసుకుని ఇంటిముఖం పట్టాడు. ఎదురుగా సుగుణ వొచ్చింది.

"ఆన్సర్ పడేశాడమ్మా" అని, వెంటనే నాలుక కరుచుకున్నాడు.

సుగుణ ఆయన చేతిలోని కాగితాలు తీసుకుని చదవసాగింది. ఆమె చేతులు వణికాయి

"ఇదేమిటి నాన్నా, ఈపేరా అర్థం ఏమిటి?" సుగుణ నుంచోలేక పోయింది. దభాలున అక్కడున్న ఓ కుర్చీలో కూలబడ్డది. ఆమె కాళ్ళూ. చేతులూ వణకసాగాయి.

"మూర్ఖుడు." అన్నాడు జగన్నాథం పంతులు.

సుగుణకి భూమి గిర్రున తిరుగుతున్నట్లు స్పష్టపడింది. రెండుచేతులతో ఆమె తల పట్టుకుంది. ఆమె అవస్థచూసి జగన్నాథం పంతులుకి కళ్ళవెంబడి అశ్రువులు టపటప రాలాయి.

"ఇంత అన్యాయమా?" గద్గదికంగా అన్నది సుగుణ.

"హుం. కాగితంమీద రాయగానే సరా! ఎలా బుజువు

చేస్తాడో చూస్తాను. జగన్నాథం పంతులంటే ఎవడనుకు న్నాడో! వీడు పట్టిన కేసు ఓడటమనేది ఎన్నడూ లేనే లేదని వాడికేం తెలుసు? నా కెదురుగా ఉన్న ఒక్కొక్క ప్లీడర్ మూడు చెరువుల నీళ్లు తాగాడు. నా తడాఖా చూపిస్తాను. హుం. ఇంత అన్యాయమా."

ఉద్రేకంలో ఏమేమో అనసాగాడు జగన్నాథం పంతులు. సుగుణ నిశ్శబ్దంగా శూన్యంలోకి చూస్తూ ఆలోచించింది. జగన్నాథం కాస్త శాంతించిన తరవాత సుగుణ అన్నది.

"దావా ఒదులుకుందాం, నాన్నా."

"అదేమిటమ్మాయ్?" అన్నాడు జగన్నాదం పంతులు ఆశ్చర్యంగా.

"అవును నాన్నా. వొదులుకుందాం."

"ఎందుకు? ఇప్పుడు దావా వొదులుకుంటే ఇంకేమన్నా ఉందా? ఎంత అప్రతిష్ఠ!"

"అప్రతిష్ఠ ఏం ఉండదు నాన్నా."

"ఎందుకుండదమ్మాయ్! ఆరోపణని ఖండించి, అబద్ధ మని మనం ఋజువు చేసుకోవద్దూ? లేకపోతే అంతా అది నిజ మేనని పుకారు వెయ్యరూ?"

"ఎవరికోసం నాన్నా ఋజువులు, లోకానికా?"

"నలుగురు పెద్దమనుషులకి అది అబద్ధమని."

"పెద్దమనుషుల నమ్మకాలతో మనకి పనేమిటి? నమ్మ వలసినవాళ్లు నమ్మితే చాలు."

"అంటే?"

"వారు ఈ ఆరోపణలు నిజమేనని మనస్ఫూర్తిగా నమ్మితే మనం చేసే బుజువులు అనవసరం. కేవలం కేసు గెలవటానికే వారు ఇలా చేస్తే బుజువులు అంతకంటే అనవసరం. ఇంత ద్రోహం చెయ్యటానికి డబ్బే కారణమయితే, ఆడబ్బుని వారినే తీసుకోనీ. కాని నేను నిజం తేల్చుకోవాలి."

"మళ్ళీ నువ్వక్కడికి వెళతానంటావా ఏమిటి?"

"అవును."

"ఎందుకమ్మా, ఇంతవరకూ పొందిన అవమానాలు చాలవూ?"

"ఇది ఆఖరుసారేమో నాన్నా. ఏదో ఒకటి ఈసారి తేలిపోవచ్చు."

జగన్నాధం పంతులు కళ్ళల్లో నీళ్ళు తిగారియి.

"తల్లిలేని పిల్లవని ఎంతో గాఢాబంగా పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి చివరికి ఓ దుర్మార్గుడి చేతుల్లో పెట్టానమ్మా నిన్ను."

"మనం సర్వజ్ఞులం కాదుగా నాన్నా. జరిగిన దానికి మనం విచారించటం అనవసరం. ఎవరి అదృష్టం వాళ్ళది."

"ఆపదల్లో ధైర్యం చెప్పుకోటానికి అది ఒక్కటే మార్గం."

ఆరోజే ఇద్దరూ పట్నం బయలుదేరారు. దావా వాదులుకున్నానని ఇద్దరు ప్లీడర్లతో చెప్పటానికి జగన్నాధం పంతులు బయలుదేరాడు.

పట్నం చేరగానే జగన్నాథం పంతులు దిగిపోయాడు బండిలోంచి. ఇల్లు సమీపిస్తున్నకొద్దీ సుగుణకి గుండె గబగబ కొట్టుకోసాగింది.

ఓరగా వేసిన తలుపు తెరుచుకొని లోపలి కెళ్ళింది సుగుణ. ఎదురుగా చంద్రం ఉన్నాడు. తలుపు చప్పుడు వినగానే తలెత్తి చూశాడు. సుగుణ !

చంద్రం మనసు మనసులో లేదు. సుగుణని చూడగానే అతనికి ముచ్చెమటలు పోశాయి. క్రాస్ ఎగ్జామినేషన్‌కి గురికాబోన్న ముద్దాయిలా ఓ క్షణం కంపించాడు.

సుగుణ అతని దగ్గరగా వొచ్చింది. అతను వొంచిన తల ఎత్తలేక పోయాడు. రాబోయే తుఫానుకు సిద్ధపడినవాడిలా చేతులు ముడుచుకు కూర్చున్నాడు.

సుగుణ నోట్లోంచి ఒక్కమాటకూడా రాలేదు. ఏమనాలి, ఏం చెప్పాలి? ఎలా మొదలు పెట్టాలి, అసలావిషయం ప్రసక్తికి తీసుకురావటం ఎలాం?

ఎంతసేపటికీ, ఏమీ మాటలు వినపడకపోవటం వల్ల ఆశ్చర్యం వేసింది. తుఫానుముందు కలిగే నిశ్శబ్దమేనా ఇది? తన నేవిధంగా సమర్థించుకుంటాడు? అసలు ఎలా సమర్థించుకోగలడు? ప్రత్యక్షంగా సుగుణవచ్చి సవాలు చేస్తుంటే అబద్ధం ఆడాలనుకున్నా అసలు అది బయటికి రావొద్దూ?

సుగుణ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. మాటలు పెకిలి

రావటంలేదు. ఆమె కెందుకో ఒక్కసారి గట్టిగా ఏడ్చేయా లని ఉంది, కాని తమాయించుకుంది.

పిడుగుల వర్షం ఇంకా పడదేం? ఇంకా నిమిషం—అర నిమిషం—పదిక్షణాలు—క్షణం—ఇంకా ఉరుములు ఉరమ వేం? రామచంద్రరావు ఏక్షణంలో ప్రవాహం కట్టలు తెంచు కుని తనమీద ఉరుకుతుందోనని భయపడుతున్నాడు.

ఆ అసహ్యకరమైన మాటలు నోటినుంచి ఎలావస్తాయి. ఛీ! ఆ విషయం గురించి తను మాట్లాడలేదు. లాభంలేదు. సుగుణ మాట్లాడే ప్రయత్నం విరమించుకుంది. మాటలరూపం లో బయటపడాల్సిన భావోద్వేగం అంతా ఆమె కళ్ళల్లోంచి బయటికి వస్తోంది.

ఎంతసేపటికీ సుగుణ మాట్లాడక పోవటం చూసి, చంద్రం తలెత్తి సాహసంతో ఆమె కళ్ళలోకి చూశాడు. ఆమె కళ్ళార్పకుండా అలాగే చూసింది.

"దావా వొదులుకున్నారు, మా నాన్నగారు,"

ఇహ సుగుణ అక్కడ నుంచోలేక పోయింది.. చప్పున వెనక్కితిరిగి పక్కగదిలోకి వెళ్ళింది.

చంద్రం కాస్త తెప్పరిల్లాడు. జరిగింది. ఓ ఆశ్చర్యకర మైన విషయంగా అతనికి తోచింది. సుగుణ ఏమన్నా తను పడ టానికి సిద్ధంగా ఉన్నాడు. కాని ఆమె తనని ఏమీ అనలేదు. ఒక్కమాటకూడా అనలేదు. కోపగించుకోలేదు. అసహ్యపడ లేదు. ఆఖరికి, "ఇంత అన్యాయం చేస్తారా? అని అడగనైనా

అడగలేదు. చంద్రంకి కడుపులో చెయ్యిపెట్టి కదిపినట్టయింది. “అసలు సుగుణ ముఖం ఎలా చూడగల” నని మొదట అనుకున్నాడు. కాని ముఖంవైపు ఇంకా చూడాలని బలీయమైన వాంఛ కలిగింది. అవ్యక్తంగా ఏదో బాధ కలిగిం దతనికి. అశాంతి, బాధ, అస్పష్టమైన ఆవేదన అతనిని వేధించుకు తింటున్నాయి. లేచి సుగుణ గోడవైపు తలపెట్టుకుని ఉంది. ఏం చేస్తోందో?

ఇంతలో అతనికి “దావా వదులుకున్నారు మానాన్న గారు” అనే సుగుణ మాటలు జ్ఞాపకం వచ్చాయి. వెంటనే అతను ప్లీడరు దగ్గిరికి పరిగెత్తాడు. అదివరకే అక్కడికి జగన్నాధం పంతులు వచ్చి కూర్చుని వున్నాడు. ఆయన్ని చూడగానే చంద్రంకి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. “ఇంటి దగ్గర తప్పించుకున్న పిడుగుల వర్షం ఇక్కడ తప్పదురా బాబూ” అనుకున్నాడు.

“కూర్చోండి చంద్రంగారూ.” అన్నాడు ప్లీడరు.

చంద్రం మాట్లాడకుండా కూర్చున్నాడు. ఇహ జగన్నాధం పంతులు మొదలు పెడతాడు గావును. ఏదీ, ఇంకా వడగళ్ళవాన ప్రారంభం కాలేదేం?

అల్లుణ్ణి చూసి జగన్నాధం పంతులికి ఎన్నడూ కలగని ఏహ్యాభావం కలిగింది. తల వాచేటట్లు చీవాట్లు పెడదామనుకున్నాడు. కాని ఒక్కమాట కూడా నోరు పెకలి రాలేదు. “ఛీ, ఈ మూర్ఖుడితో నాకేమిటి? డబ్బుకోసం భార్యానూ

నాన్ని బజారులో పెట్టడానికి శంకించని ఛండాలుడు అను కున్నాడు. అదే భావంతో దేశద్రోహిని చూసినట్టు చూశాడు అల్లుడివైపు. అదే సమయంలో చంద్రంకూడా జగన్నాథం పంతులు వైపు చూశాడు. ఆ చూపు! చంద్రం పంచప్రాణాలు వణికాయి. ఎంత అసహ్యకరమైంది ఆ చూపు! ఎంత నీచభావంతో చూస్తున్నాడు! నిజమే, తను చేసిన పనికి అలా చూడటం అసమంజసంకాదు. చంద్రం సిగ్గుతో తల వంచుకున్నాడు. తిరస్కారంగా మరోసారి చంద్రంవైపు చూసి ప్లీడర్ దగ్గర సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు జగన్నా దంపతులు. ప్లీడర్ తో చెప్పాలిసిందేదో చెప్పి చంద్రంకూడా ఇంటిదారి పట్టాడు మరో అయిదునిమిషాల తరవాత.

ఇంటికి రాగానే సుగుణ గదిదగ్గరకి వెళ్ళాడు. లోపల నుంచి ఏవో మాటలు వినపడుతున్నాయి.

"భూషణం అంటే అంత తిరస్కారం మంచిదికాదు సుగుణా, మళ్ళి ఇంకోసారి చెబుతున్నాను."

కాసేపటి నిశ్శబ్దం తరువాత ఒక వెకిలినవ్వు వినపడ్డది.

"ఆ చంద్రం నీకేం ఒరగబెట్టాడు? నా మాట విను."

చంద్రానికి ఆ క్షణంలో మొక్కడలేనిఅసహ్యం వేసింది. తటాలున అతను లోపలికి వెళ్ళాడు. భూషణం అతన్ని చూసి కాస్త తడబడ్డాడు.

"ఎందుకొచ్చావిక్కడికి?"

"ఆఁ... ఏదో... ఊరికే..."

"మళ్ళీ యీ గుమ్మందగ్గర నువ్వు నాకు కనబడ కూడదు తెలిసిందా?"

భూషణం వెకిలిగా నవ్వాడు.

చంద్రంగారు భూషణం సంగతి మర్చిపోతున్నారు."

ఈ హెచ్చరికవిని చంద్రానికి అరికాలిమంట నెత్తి కెక్కింది.

"అందరిసంగతీ నాకు తెలుసు. మర్యాదగా బయటికి నడు"

చంద్రం కటుస్వరం విని భూషణం యేమనుకున్నాడో గాని మళ్ళీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ ఒక్క మాటన్నాడు.

"భూషణం మనోరమ అన్న అనేమాట మర్చిపోకండి మూర్తిగారూ!"

కోపంతో వళ్ళు మండిపోయి "ఇద్దరూ కలిసి గంగలో దూకండి" అన్నాడు. భూషణం ఏదో సణుక్కుంటూ వెళ్ళి పోయాడు.

చంద్రం సుగుణకి దగ్గిరగా వెళ్ళాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఆ నిశ్శబ్దం చంద్రంకి దుస్సహంగా ఉంది. తని హృదయంలో తుఫాను చెలరేగింది. సుగుణ కోపంతో

ఒక్కమాట అయినా అనివుంటే అంత బాధపడేవాడు కాదు. కసిగాగాని, మన్మథ్వనితోగాని ఒక్క ఎత్తిపొడుపుమాట అయినా అనివుంటే...! కాని సుగుణ నేలచూపులు చూస్తూ బెల్లంకొట్టిన రాయిలా నుంచుంది. తనని నిందించటానికి భాషలో మాటలు లేవేమో అనుకున్నాడు చంద్రం. క్షణాలూ, నిమిషాలూ అలాగే దుర్భరంగా నడిచిపోతు న్నాయి.

చివరికి సుగుణే అన్నది.

"నన్ను క్షమించండీ, మిమ్మల్ని అవమానించటానికి కానీ, దావా వెయ్యలేదు. నా దురదృష్టానికి కారణమైన డబ్బుని మీ నుంచి వేరుచెయ్యాలని—"

క్షమాపణ అడగవలసింది తను. అయినా సుగుణే అడిగింది. ఈ దెబ్బతో చంద్రం పూర్తిగా కుంగిపోయాడు.

ఘోరమైన పరాజయం పొందుతున్నాడతను.

సుగుణా! నన్ను క్షమించు అందామని అతని ప్రయత్నం కాని ఆ మాటలు ఎంతసేపటికీ అతని నోటినుంచి రాలేదు.

"నన్ను ఎలాగో ఇక్కడే వుండనియ్యండి." ఈ ఆఖరి దెబ్బకి చంద్రం ఇహ తట్టుకోలేకపోయాడు. హఠాత్తుగా

సోఫాలోని పాపాయిని ఎత్తుకుని గుండెకదుముకున్నాడు. అతని గుండెల్లోని అవ్యక్తమైనబాధ ఏదో క్రమంగా జారిపోతోంది. నీళ్ళునిండినకళ్ళతో అతడుపాపాయికళ్ళవైపు అలాగే చూశాడు. పాపాయి వేదాంతిలా నవ్వాడు

---